హైదరాబాద్ వార్త



# నగర శివారులో ఘోర రోడ్డు ప్రమాదం

-రోడ్డు పై గోతులతో తప్పించబోయి ప్రమాదం
-చేవెళ్ల ఆసుపత్రిలో మృతదేహాలను పరిశీలించిన మంత్రులు. ఎంపి. మాజీ ఎమ్మెల్యేలు,
-ప్రభుత్వ కళ్ళుతెరిచి రోడ్డు విస్తరణ పనులు వేగం పెంచాలని స్థానికుల డిమాండ్



**హైదరాబాద్,(చేవెళ్ల) నవంబర్ 3, ప్రభాతవార్త :** నగర శివారులోని చేవెళ్ల. మీర్జాగూడ గ్రామ సమీపంలో బీజాపూర్ జాతీయ రహదారి పై ఆర్టీసిబస్సు, టిప్పర్ ఢీ 19 మంది మృతి చెందగా, మిగిత ఇరువైనాలుగు మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు, చేవెళ్ల ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి, మాజి ఎమ్మెల్యే రత్నం, మాజి మంత్రి సబితా ఇంద్రారెడ్డి క్షతగాత్రులను పరమార్శించి, చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలోని మృతదేహలను పరమార్శించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేవెళ్ల ప్రమాదం చాల ప్రమాదకరమైందని, వృతుల కుటుంబాలకు వారి ప్రగాడ సానుభూతిని తెలియజేశారు, బీజాపూర్ రహదారి గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగాయని, ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనుల్లో నిర్లక్ష్యం వహించడమే ఇలాంటి ప్రమాదాలకు దారితీస్తున్నాయన్నారు ప్రభుత్వం మృతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి సంఘటన స్దలానికి చేరుకోని అక్కడే ఉండి మృతదేహలను కుటుంబాలకు పోస్టుమాటం నిమిత్యం వారికి అందజేసేంతవరకు అక్కడే ఉండి అధికారులను అప్రమతం చేశారు, ప్రమాదానికి కారాణల పై పోలీసులు విచారణ చేప్పట్టారని అన్నారు, చేవెళ్ల స్దానికులు మాట్లాడుతూ హైద్రాబాద్ బీజాపూర్ రహదారి అది దారికాదని, యమపూరికి దారిగా మారిందని, ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న బీజాపూర్ రహదారిపై నిర్లక్ష్యం వహించడం వల్లనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, కొన్ని నెలల క్రితం ఆలూర్ వద్ద, ప్రమాదం, చేవెళ్ల టౌన్లో ఒ చిన్నారి తండ్రి మృతి ఇలా ఎన్నో ప్రమాదాలు తరుచుగా జరుగుతున్నాయని వాపోతున్నారు, 2018లో బీజాపూర్ రోడ్డు విస్తరణకు రైతుల వద్ద భూములు తీసుకున్నారని, ప్రభుత్వం కాంట్రాక్టుల కాలయాపనతో నిత్యం రోడ్డు ప్రయాణం నరకయాతనగా మారిందంటు, నిత్యప్రమాదాలకు అడ్డుకట్టవేయని అధికారులే ఇ ఘటనకు కారణమంటున్నారు, బీజాపూర్ జాతీయ రహదారి పై గోతులు ఏర్పడి రోడ్డు అక్కడక్కడ కృంగా ఉండడం, ఒక వైపు కృంగా ఉండడం, పెరిగిన ప్రయాణికులకు రోడ్డు విస్తరించకపోవడం కారమని వాపోతున్నారు, సంఘటన స్దలానికి ఆర్డీవో, సైబరబాద్ కమిషనర్, డిసిపిలు, ఎస్పిలు, వచ్చి సంఘటన స్దలాన్ని పరిశీలించారు.

## చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో విషాదచాయలు

### -కాలేజీలో చదువుతున్న ముగ్గురు అక్కచెల్లెళ్లు

**గన్ఫౌండ్రి,నవంబర్ 3ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాలో సోమవారం తెల్లవారు జామున జరిగిన ఘోరా బస్సు రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్క,చెల్లలు దుర్మరణం చెందారు.అక్కా,చెల్లలు నగరంలోని కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయంలో విద్యనుఅభ్యసిస్తున్నారు.తాండూరు చెందిన ఎల్లయ్యగౌడ్ కుమార్తెలైన నందిని డిగ్రీ మొదటి సంవత్సరంచదువుతుంది.రెండవ కూతురు సాయిప్రియ డిగ్రీ ఫైనలియర్ చదువుతుంది. మూడవ కుమార్తె తనూషఎంబిఎ విద్యను అభ్యసిస్తున్నారు.బంధువుల ఇంటిలో జరిగిన శుభకార్యానికి వెళ్లి సోమవారం ఆర్టిసి బస్సులో అక్కా,చెళ్ల వస్తుండగా టిప్పర్ రూపంలో వచ్చిన మృత్యువు కబళించి వేసింది. ఈవిషయం తెలియడంతో కోఠిలోని చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయంలో తోటి విద్యార్దినీలతోపాటు కళాశాల ప్రిన్సిపల్,అధ్యాపకులు కంట తడి పెట్టారు. కళాశాలల్లో విషాద చాయలు అలుముకున్నాయి.తమ తొటి స్నేహితులు టిప్పర్ వచ్చి ఆర్టిసి బస్సును ఢీకోట్టి తమ స్నేహితుల ప్రాణాలను బలికొనడంపట్ల అటు కళాశాల ప్రిన్సిపల్ ఎల్.పావని, అధ్యాపకులు, విద్యార్దీనులు తీవ్ర కంట తడిపెట్టారు.



బస్సు ప్రమాదంలో మరణించిన అక్కచెల్లెళ్లు

# పార్కులు, ప్రభుత్వ భూములను కాపాడండి

-నేతల భూకబ్జాల నుంచి విముక్తి కల్పించాలి
-హైడ్రా ప్రజావాణికి 61 ఫిర్యాదులు

**హైదరాబాద్, నవంబర్ 3,ప్రభాతవార్త:** ఒకరిద్దరి ధన దాహానికి ప్రభుత్వ స్థలాలు, పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాలకు గురి అవుతున్నాయని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేయడానికి వచ్చిన పలువురు వాపోయారు. ఆర్థిక, అంగ బలంతో నేతలు చేస్తున్న కబ్జాలను నియంత్రించి.. ఆయా ప్రాంతాల్లో ఉన్న వేలాది మందికి ప్రయోజనం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలంలోని మల్లాపూర్ విలేజ్లో ఏ ఎం ఆర్ టౌన్షిప్లో 2 పార్కులతో పాటు.. రెండు రహదారులను ఆక్రమించేశారంటూ టౌన్షిప్ నివాసితుల ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. అలాగే సంగారెడ్డి జిల్లా రామచంద్రాపూరం సాయినగర్ కాలనీలో నాలా పక్కన ఉన్న ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నాయని శ్రీ సాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. అమీర్పేట మండలం సంజీవరెడ్డి నగర్ సర్వే నంబరు 102/1, 102/3 లో 1550 గజాల స్థలం పార్కుకోసం కేటాయించగా దానిని కబ్జా చేస్తున్నారంటూ అక్కడి నివాసితులు వాపోయారు. ఇలా నగరం నలుమూలల నుంచి సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 61 ఫిర్యాదులందాయి. వీటిని హైడ్రా అదనపు కమిషనర్ ఎన్ అశోక్ కుమార్ పరిశీలించి..వాటి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.

### ఫిర్యాదులు ఇలా..

సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ పెద్ద చెరువుకు ఉన్న అలుగు ఎత్తు పెంచడమే కాకుండా.. ఉన్న నాలుగు తూములను పూర్తిగా మూసేయడంతో ఏటా దాని విస్తీర్ణం పెరిగిపోయి పై భాగంలో ఉన్నలే ఔట్లన్నీ మునిగిపోతున్నాయని ప్లాట్ యజమానులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గతంలో 93 ఎకరాల మేర ఉన్న చెరువు ఇప్పుడు 400ల ఎకరాలకు పైగా విస్తరించి ఉందని పేర్కొన్నారు. ఈ చెరువు నుంచి నీళ్లు బయటకు పోకపోవడంతో కింద ఉన్న కుమ్మరి కుంట, బందంకొమ్ము, శాంబునికుంట, ఇసుకబావి చెరువులకు నీరందక అవి కబ్జాలకు గురి అవుతున్నాయని ఫిర్యాదులో వివరించారు. దాదాపు 4 దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్యను హైడ్రా వెంటనే పరిష్కరించాలని కోరారు... మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారం మున్సిపాలిటీ అన్నోజీగూడ సర్వే నంబరు 44, 45లో పాఠశాల భవనానికి కేటాయించిన 1967 గజాల ప్రభుత్వ భూమి కబ్జాలకు గురి అవుతోంది. వెంటనే ఈ స్థలానికి ఫెన్సింగ్ వేసి కాపాడాలని వెంకట సాయి కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని గుట్టలబేగంపేటలోని మేడికుంట చెరువును కాపాడాలంటూ అక్కడి నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. 24.19 ఎకరాలున్న చెరువుకు ఒక వైపు 80 అడుగుల రహదారి ఉండగా.. లోపలి వైపు నుంచి ఆక్రమణలు గురౌతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ్మిడికుంట సున్నం చెరువు మధ్య ఈ చెరువు అనుసంధానంగా ఉండేదని.. ఇప్పుడీ చెరువు ఆక్రమణలకు గురైతే.. భూగర్భ జలాలకు ఇబ్బంది ఏర్పడుతుందని తెలిపారు. వెంటనే ఆక్రమణలు తొలగించి పూర్తి స్థాయిలో చెరువును అభివృద్ధి చేయాలని కోరారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న హైడ్రా అదనపు కమిషనర్ అశోక్కుమార్

## వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి

తెలంగాణ విద్యుత్ అంబుడ్స్మెన్ మహ్మద్ నిజాముద్దీన్




సమావేశంలో మాట్లాడుతున్న మహ్మద్ నిజాముద్దీన్, డైరెక్టర్ చక్రపాణి తదితరులు

**హైదరాబాద్,నవంబర్ 3,ప్రభాతవార్త:** విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, సంతృప్తికరమైన సేవలు అందించాలని తెలంగాణ విద్యుత్ అంబుడ్స్మెన్ మహ్మద్ నిజాముద్దీన్ అన్నారు. ఈమేరకు సోమవారం మింట్కాంపౌండ్లోని మెట్రోజోన్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినియోగదారులు దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా విద్యుత్ ఉద్యగులు, ఇంజనీర్లుకు పలుసూచనలు చేశారు. వినియోగదారుడు సంస్థపై ఆధారపడలేదని, మనవమే వారిపై ఆధారపడ్డామనే విషయాన్ని దృష్టిలోపెట్టుకుని వివిధ సేవల నిమిత్తం తమవద్దకు వచ్చే వినియోగదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సిబ్బందికి అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో టిజిఎస్పిడిసిఎల్ డైరెక్టర్ (కమర్షియల్) చక్రపాణి, సిజిఆర్ఆఫ్2 చైర్పర్సన్ బత్తుల లలిత, ఛీఫ్ ఇంజనీర్ భిక్షపతి, ప్రభాకర్, అనిల్రెడ్డి, సెంట్రల్ సర్కిల్ సిఈ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆహ్లాదం పంచాల్సిన పార్కులు నిరుపయోగం

-పట్టించుకోని పాలకులు,అధికారులు

**బేగంపేట నవంబరు 3,ప్రభాతవార్త** నగరంలో ఆహ్లాదం కరువవుతుంది. ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు అలంకార ప్రాయంగా మారాయి.పార్కులలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు పిచ్చి మొక్కలు పేరుకు పోయాయి. ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు అనారోగ్యాన్ని పంచే కేంద్రాలుగా మారుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.బేగంపేట ఓల్డ్పాటిగడ్డలో ఉన్న పార్కు చాలా కాలంగా నిరుపయోగంగా మారడంతో అందులో పిచ్చి మొక్కలు మొలిచాయి.ఇదే అదునుగా భావించిన కొందరు చెత్తను కవర్లలో కట్టి అందులో పడవేస్తుండటంతో ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు అనారోగ్యాన్ని పంచుతుందని స్థానికులు వాపోతున్నారు.ఓల్డ్పాటిగడ్డలో ఉన్న ఈ పార్కును గతంలో ఎంతో సుందరంగా తయారు చేసారు.ఆ తర్వాత నిర్వహణ పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలతో నిండిపోయింది.దీంతో యువకులు,సీనియర్ సిటిజన్స్,మహిళలు ఉదయం,సాయంత్రం వాకింగ్ చేసేందుకు అవకాశం లేకుండా పోయింది.ఇదే సమయంలో సాయంత్రం చిన్నారులు ఆడుకునే వీలులేకుండా పోయింది.దీంతో వారు రైల్వేస్టేషన్ ముందు వాకింగ్ చేసుకోవాల్సి వస్తుంది.పార్కులో మొక్కలు పెరిగిపోయి చెత్త నిండిపోయి కంపు కొడుతుండటంతో కాలనీ రోడ్లపైనే ఆడుకుంటూ వాహనాలకు తగిలి ప్రమాదాలకు గురవుతున్నారని చిన్నారుల తల్లి దండ్రులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా ఓల్డ్ పాటిగడ్డలో నిరుపయోగంగా మారి అనారోగ్యాన్ని పంచుతున్న ఈ పార్కును శుభ్రం చేసి వినియోగంలోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.



ఓల్డ్పాటిగడ్డలో నిరుపయోగంగా ఉన్న పార్కు...

## వృద్ధులు ,వికలాంగులకు"హోమ్ ఓటింగ్ "

-ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికే ఛాన్స్
-4,6 తేదీల్లో ఓటింగ్కు అవకాశం
-రిటర్నింగ్ అధికారి సాయిరాం

**హైదరాబాద్,నవంబర్ 3,ప్రభాతవార్త:** భారత ఎన్నికల సంఘం 85 ఏళ్ల పైబడిన వృద్ధులకు,40 కంటే ఎక్కువ వికలాంగత కలిగిన వ్యక్తులకు (ఓటర్ లిస్టులో నమోదు అయిన వారికి) ఇంటి వద్దనే తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక సదుపాయం కల్పించిందని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక రిటర్నింగ్ అధికారి పి సాయి రాం తెలిపారు.ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. ఈ సందర్భముగా ఈ సదుపాయం కోసం ముందుగానే రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకున్న వృద్ధులు 84 ఓట్లు ,వికలాంగులు, 19 ఓట్లు వారి నుండి దరఖాస్తు రావడం జరిగింది. జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తము 103 మంది ఓటర్లకు గాను తేదీ4న అలాగే 6న రెండు రోజులలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మొత్తము 103 ఓటర్లకు ఇంటి వద్దకు ఎన్నికల సిబ్బంది వారి యొక్క ఇంటికి వెళ్లి వారిచే ఓటు హక్కును సద్వినియోగం చేసుకొనుటకు గాను సదుపాయం కల్పిస్తారని రిటర్నింగ్ ఆఫీసర్ తెలిపారు.

## కార్తీక సోమవారం దీపాలు వెలిగించిన కలెక్టర్

**బేగంపేట నవంబరు 3,ప్రభాతవార్త** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో రెండవ కార్తీక సోమవారం సందర్భంగా కార్తీక దీపాలు వెలిగించారు.ఈ సందర్భంగా ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్రెడ్డి ఆలయంలో పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేసారు.రెండవ కార్తీక సోమవారం సందర్భంగా ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేసారు.ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన,నార్త్జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్,ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్రెడ్డి దంపతులు తదితరులు కార్తీక దీపాలు వెలిగించారు.సోమవారం శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయం కార్తీక దీపాల శోభతో కళకళ లాడింది.



శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న కలెక్టర్ హరిచందన,డీసీపీ సాధన రష్మీపెరుమాళ్ ఈఓ మనోహర్రెడ్డి.

## పెయింటర్ దారుణ హత్య

**నాచారం, నవంబర్ 3 ప్రభాతవార్త :** నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో కూలి పనిచేసే ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం. ఉప్పల్ కళ్యాణ్పురికి చెందిన చెందిన మురళి కృష్ణ (45) తన బార్యతులసి రత్నంతో కలిసి జీవనం సాగిస్తున్నారు. మురళి కృష్ణ పెయింటర్గా కూలి పనిచేస్తుండగా బార్య తులసి రత్నం కేర్ టేకర్గా పనిచేస్తుంది. గత ఏడాది క్రితం వీరు జిల్లెలగూడ మీర్పేట్ ప్రాంతంలో నివాసం ఉండి కళ్యాణ్ పురికి వచ్చారు. కాగా ఆదివారం సాయంత్రం తన సోదరుడు నివసించే మీర్ పేట్కు మృతుడు మురళి కృష్ణ వెళ్లాడు. ఏం జరిగిందో ఏమో కానీ సోమవారం ఉదయం గుర్తుతెలియని దుండగులు నాచారం పారిశ్రామిక వాడలోని తెలంగాణ ఫుడ్స్ కంపెనీ వద్ద ఓ కారులో అతనిని తీసుకువచ్చి కత్తితో పొడిచినట్లు సమాచారం. కత్తిపోట్లతో తీవ్ర రక్తస్రావం జరిగి మురళీకృష్ణ మృతి చెందాడు. ఇదిలా ఉండగా ఒక గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి, ఆమె భర్త గాయాలతో రక్తస్రావం అవుతున్న స్థితిలో కనిపించాడని, అంబులెన్స్ సిబ్బంది చికిత్స అందిస్తున్న సమయంలో మరణించాడని తెలియజేశాడని పేర్కొన్నారు.ఆమె వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని, భర్త మృతదేహాన్ని ముఖం, ఎడమ చేయి, వెన్నుపైన గాయాలతో, రక్తపు మరకలతో కూడి రోడ్డుపై పడి ఉన్నట్లు గమనించిందని తెలిపారు.ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## 'జూబ్లీ'లో కమలం విజయం పక్కా

- వాహన ర్యాలీలో కేంద్ర మంత్రి కిషన్రెడ్డి



వాహన ర్యాలీలో అభివాదం చేస్తున్న కిషన్రెడ్డి

**జూబ్లీహిల్స్, నవంబరు 3, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం పక్కా అని కేంద్ర మంత్రి కిషన్రెడ్డి అన్నారు. సోమాజీగూడ డివిజన్లోని నాగార్జున కమ్యూనిటీ హాల్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో మెగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ నాగార్జున కాలనీ నుంచి శ్రీకృష్ణ నగర్, బోరబండ మీదుగా వేలాది మంది కార్యకర్తలతో ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కిషన్రెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభించాలన్నా, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నా బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఇప్పటికే ప్రజలు బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలను చూశారని ఇప్పుడు బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులను తీసుకొస్తానని అన్నారు. సోమవారం ఉదయం కృష్ణకాంత్ ఉద్యానవనంలో కిషన్రెడ్డి మరోసారి పర్యటించారు. వాకర్లు, స్థానికులతో కలిసి ఆయన చర్చించారు. బీజేపీకి అవకాశం కల్పించాలంటూ కోరారు. ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీల మోసపు తీరును గమనించాలన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఈ సారి బీజేపీ గెలుపు కాయమని, రెండో స్థానం కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీపడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గౌతంరావు తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం కమిషన్ సొమ్ముతో బిఆర్ఎస్ ప్రచారం

- ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి

**జూబ్లీహిల్స్, నవంబరు 3, ప్రభాతవార్త:** కాళేశ్వరం అవినీతి సొమ్ముతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ విచ్చలవిడి ప్రచారం చేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి ఆరోపించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహ్మత్నగర్ డివిజన్లో సోమవారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. అయిదు వందల రోజుల్లో ప్రభుత్వాన్ని కూలదోస్తామని కేటీఆర్ అంటున్నారు. అవినీతి సొమ్ముతో కుట్రకు పాల్పడుతున్నారా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. కాళేశ్వరం కమిషన్లతో కాంగ్రెస్ను ఓడించాలనే బీఆర్ఎస్ ప్రయత్నాన్ని జూబ్లీ ప్రజలు ఖచ్చితంగా తిప్పికొడుతారని, మరో పది రోజుల్లో ఇది తేలిపోతుందన్నారు. దాదాపు 200ల మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో ఆయన సమక్షంలో చేరారు. ఆటో డ్రైవర్లు కాంగ్రెస్కు మద్దతుగా ప్రదర్శన నిర్వహించారు.



ఆటో ప్రయాణికుడిని ఓటు వేయాలని కోరుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి.

### యూసుఫ్గూడలో ఉత్తమ్కుమార్రెడ్డి

మహిళలను సంపన్నులను చేయాలనేదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డి అన్నారు. యూసుఫ్గూడలో నిర్వహించిన మహిళా కాంగ్రెస్ సభలో ఆయన మాట్లాడుతూ.. ఇది మహిళా పక్షపాత ప్రభుత్వమని, మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్లు, సౌర విద్యుత్ కేంద్రాలు, ఇందిరమ్మ క్యాంటీన్లు ఇచ్చిందన్నారు. తొలిసారిగా మహిళలకు భీమా కల్పించిన ప్రభుత్వం తమదేనని అన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఈ ఉప ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్కు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

## కదిలిన మహిళా గులాబి దండు

- ప్రచారంలో పాల్గొన్న మల్లారెడ్డి, సుధీర్రెడ్డి, ఎర్రబెల్లి, పద్మాదేవేందర్రెడ్డి



మహిళా ర్యాలీలో పాల్గొన్న పద్మా దేవేందర్రెడ్డి

**జూబ్లీహిల్స్, నవంబరు 3, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వెంగళ్రావునగర్ డివిజన్లో సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహిళలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కృష్ణకాంత్ ఉద్యానవనం నుంచి మొదలైన ఈ ర్యాలీ యూసుఫ్గూడ కూడలి మీదుగా మధురానగర్ వరకు చేరింది. దాదాపు మూడు కిలోమీటర్ల పాటు కొనసాగిన ఈ ర్యాలీలో వేలాది సంఖ్యలో బీఆర్ఎస్ మహిళలు పాల్గొన్నారు. ర్యాలీలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తుల ఉమ, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా, స్థానిక కార్పొరేటర్ దేదీప్యరావు తదితరులు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయంతో కాంగ్రెస్ పార్టీ అరాచక పాలన అంతం కావాలని ఎర్రబెల్లి దయాకర్రావు అన్నారు. కాంగ్రెస్ శ్రేణులు ఇచ్చిన హామీలపై నిలదీయాలని సూచించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్ గెలుపులో మహిళలు, మైనార్టీలు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అంతకముందు రహ్మత్నగర్ డివిజన్ శ్రీరాంనగర్లో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్భాస్కర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్రావు, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ మంత్రి మల్లారెడ్డి, దేవిరెడ్డి సుధీర్రెడ్డి సైతం ఇక్కడ ప్రచారం నిర్వహించారు.

